నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | NAGARKURNOOL

గోపాల్‌పేటలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- సచివాలయం వద్ద రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై కన్నెర్ర
- అవమానంపై బీఆర్ఎస్ భగ్గు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణతల్లి చిత్రపటాలు, విగ్రహాలకు క్షీరాభిషేకం
- వనపర్తిలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- గోపాల్‌పేట వరకు బైక్ ర్యాలీ

నిరసనల హోరు

తెలంగాణ తల్లి విగ్రహానికి నిరంజన్‌రెడ్డి క్షీరాభిషేకం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిరసనలు హోరెత్తాయి. రాష్ట్ర సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. మంగళవారం జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో గులాబీ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. తెలంగాణ తల్లి విగ్రహాలకు, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. క్షమించు తల్లీ అంటూ వేడుకున్నారు. తెలంగాణతల్లి విగ్రహ స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెడతారా సిగ్గు.. సిగ్గు.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి వనపర్తి నుంచి గోపాల్‌పేట వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని పాలతో శుద్ధి చేశారు. అలాగే మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం నివాసంలో, మహబూబ్‌నగర్, కోస్గిలో గ్రంథాలయ సంస్థల మాజీ చైర్మన్లు శాసం రామకృష్ణ, రాజేశ్వర్‌గౌడ్, కల్వకుర్తిలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, పెబ్బేరు, కొత్తకోట, భిల్లాఘణపురం, పెద్దమందడి, జోగుళాంబ గద్వాలలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బాసు హన్మంతు, అయిజలో కురుమ పల్లయ్య ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగాయి. కేసీఆర్ ప్రభుత్వం సెక్రటరీయట్ ఎదుట భారీ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తే.. ఈ ప్రాంతంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

– మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

తెలంగాణ.. ప్రజలు.. శాశ్వతం

- ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే తెలంగాణ ఆత్మ తాకట్టు
- గాంధీభవన్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, సెప్టెంబర్ 17 : తెలంగాణ శాశ్వతం.. తెలంగాణ ప్రజలు శాశ్వతమని పార్టీలు అధికారంలోకి వస్తూ, పోతూ ఉంటాయని, అధికారం శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు శాశ్వతంగా మేలు జరిగే పనులు చేస్తే అవి గుర్తుండి పోతాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పిలుపు మేరకు మంగళవారం గోపాల్‌పేట, రేవల్లి మండల కేంద్రాల్లో ఆ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. గోపాల్‌పేట మండల కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, తెలంగాణ తల్లి విగ్రహం ముందు పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించారు. అంతకుముందు ఆయన వనపర్తి జిల్లా కేంద్రం నుంచి బీఆర్ఎస్ శ్రేణుల తో కలిసి బైక్ ర్యాలీతో మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం సర్కారు భారత యూనియన్‌లో విలీనం తర్వాత స్వయం ప్రతిపత్తి కలిగిన హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆనాటి ప్రధాని నెహ్రూ ప్రభుత్వం కుట్రతో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను సమైక్య రాష్ట్రం చేయడంతో ఆనాటి నుంచి స్వరాష్ట్ర కాంక్షకోసం ప్రజలు ఉద్యమించి, పోరాటంలో 1969 నుంచి 1972 వరకు 369 మంది అమరులయ్యారన్నారు. 60 ఏండ్ల సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ ప్రజలు అన్ని విధాలుగా నష్టపోతున్న తరుణంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజాస్వామ్యయుతంగా జరిగిన ఉద్యమం ప్రభంజనమై తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందన్నారు. పదేండ్లుగా కేసీఆర్ సర్కారు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుతో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన పదినెలల కాలంలో అన్ని విధాలుగా విధ్వంసం చేశారన్నారు. ఉచిత బస్సు తప్పా ఒక్క గ్యారెంటీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాపనార్థాలు పెడుతున్నారన్నారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీపై మాకు అపారమైన గౌరవం ఉంద ని, అతడు దేశం కోసం ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు వదిలాడన్న సానుభూతి ఉందని, కాంగ్రెస్ పార్టీ వారికి రాజీవ్‌గాంధీ మీద అంత ప్రేమ ఉంటే ఇప్పటి వరకు గాంధీభవన్ వద్ద ఆయన విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని దీనికి పీసీసీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలన్నారు. సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం ఇష్టం లేకనే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ రాజీవ్‌గాంధీ విగ్రహ ఆవిష్కరణకు రాలేదన్నారు. అంబేద్కర్ సచివాలయం, అమరవీరుల స్తూపం మధ్యలో తెలంగాణతల్లి విగ్రహం పెట్టాలని కేసీఆర్ సర్కారు నిర్ణయించినట్లు, ఎన్నికలు రావడంతో సాధ్యం కాలేదని, ఆ స్థలంలో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సముచితంగా ఉండేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని సగౌరవంగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు తరలించి, సచివాలం వద్ద తెలంగాణతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రమేశ్‌గౌడ్, వైస్‌చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, పీఏసీసీఎస్ చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, నాయకులు రఘురామారావు, చంద్రశేఖర్, మతీన్, ఖాజా, తిరుపతియాదవ్, వేణుగోపాల్, మాధవ రెడ్డి, ఉస్మాన్, ధర్మనాయక్, శేఖర్‌నాయక్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాసులు, రవి, రాజు, రాములు, మణ్యం, రాజేశ్, తేజ, సత్యనారాయణ, శ్రీధర్‌రావు, శరత్‌బాబు, సురేందర్ రాములు, శివరాంరెడ్డి, రమేశ్, సునీల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిరసనలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, మక్తల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం నివాసంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గులాబీ పార్టీ నాయకులు

చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు

పరుమాల స్టేజీ దగ్గర అదుపుతప్పి చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గద్వాల రూరల్, సెప్టెంబర్ 17 : ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పి కిందికి ఒరిగిపోయి చెట్టును ఢీకొట్టిన ఘటన మంగళవారం ఉదయం పరుమాల స్టేజీ సమీపంలో చోటుచేసుకున్నది. ఈ ఘటనలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు లేకుండా క్షేమంగా బయట పడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే గద్వాలలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు ఉదయం వివిధ గ్రామాల నుంచి విద్యార్థులను ఎక్కించుకొని గద్వాలకు బయలుదేరింది. డ్రైవర్ అజాగ్రత్తతో ఓవర్‌టేక్ చేశాడు. అదే సమయంలో ఎదురుగా మరో వాహనం రావడంతో దానిని తప్పించేందుకు రోడ్డు నుంచి కిందకు దిగడంతో బస్సు ఒరిగిపోయి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని నిలిచిపోయింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయభ్రాంతులకు గురై హాహాకారాలు చేశారు. బస్సు నిలిచిపోయిన వెంటనే డ్రైవర్ విద్యార్థులను కిందకు దించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని విద్యార్థులందరూ క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విద్యార్థులను వేరే బస్సులో పాఠశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్ పెద్ద ఆంజనేయులును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

బంగారు వ్యాపారి ఇంట్లో చోరీ

- 40 తులాల బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పెంట్లవెల్లి, సెప్టెంబర్ 17 : మండల కేంద్రంలోని తాళం వేసి ఉన్న బంగారి వ్యాపారి ఇంట్లో 40 తులాల బంగారు, వెండి ఆభరణాలను ఎత్తికెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షంషుద్దీన్ బంగారు, వెండి వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడు. రెండు రోజుల కిందట బంధువులు మృతి చెందడంతో ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్ర వెళ్లారు. ఇది గమనించిన దుండగులు ఇంట్లోకి వెళ్లి తాళం పగుల గొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాను తెరిచి 40 తులాల బంగారం, వెండిని ఎత్తుకెళ్లారు. దుండగులు తెలివిగా తమ ఆధారాలు లేకుండా ఇంట్లో కారం చల్లినట్లు డీఎస్పీ తెలిపారు. క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. బాధితుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- కేజీబీవీ రోడ్డు సౌకర్యం కోసం రూ.5 లక్షలు మంజూరు

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఉండవెల్లి, సెప్టెంబర్ 17 : కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎమ్మెల్యే విజయుడు ప్రినిపాల్ పరిమళను సూచించారు. మండలంలోని కలుగోట్ల గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తరగతి గదులు, హాస్టల్ గదులను పరిశీలించి విద్యార్థుల సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలుగోట్ల గ్రామం నుంచి కస్తూర్బా పాఠశాలకు వచ్చే రోడ్డు గుంతల మయంగా ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చేందుకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో పాఠశాలకు వచ్చినప్పుడు రోడ్డు బాగ లేదని విద్యార్థులు నా దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనుల కోసం రూ.5లక్షలు మంజూరు చేయించినట్లు చెప్పారు. రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేను విద్యార్థినులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే సాయం

జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విజయుడు తిరిగి అలంపూర్‌కు వస్తున్నాడు. కర్నూలు జిల్లాకు నందవరం మండలం పులచింత గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ బీచుపల్లిలో కొత్త కారుకు పూజలు చేయించుకొని కర్నూల్ వైపు వెళ్తుండగా కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో స్వల్పగాయాలు కావడంతో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కారు ఆపి క్షతగాత్రులకు ప్రథమ చికిత్సలు చేయించి కర్నూల్ దవాఖానకు పంపించారు. ఎమ్మెల్యే విజయుడు రోడ్డు బాధితుడికి సాయం చేయడంతో వాహనదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ఎవరైనా బాధితులకు సాయం చేసి వారి విలువైన ప్రాణాలను కాపాడాలని వాహనదారులకు ఎమ్మెల్యే సూచించారు.

బ్యాంకులో పొదుపు చేసిన డబ్బులు మాయం

- 21 మంది ఖాతాల నుంచి రూ.95 లక్షలు కాజేసిన ఉద్యోగి

బ్యాంక్ మేనేజర్‌ను నిలదీస్తున్న బాధితులు

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 17 : కంచె చేను మేసినా చందంగా బ్యాంక్‌లో పనిచేసే ఉద్యోగే ఖాతాదారుల అకౌంట్స్ నుంచి అనుమతి లేకుండా పొదుపు చేసిన డబ్బులను కాజేసినా ఘటన అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ఎస్‌బీఐలో ఆలస్యంగా చోటుచేసుకున్నది. బాధితుల కథనం మేరకు.. కష్టపడి సంపాదించిన డబ్బులు ఇండ్లలో దాచుకుందామంటే దొంగల భయం ఉంటుందని, బ్యాంకులో అయితే భద్రతతోపాటు భవిష్యత్‌లో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో బ్యాంక్‌లో దాచుకోగా తమ అనుమతి లేకుండా బ్యాంక్‌లో పనిచేసే ఉద్యోగి కిరణ్ 21మంది ఖాతాదారుల అకౌంట్ నుంచి డబ్బులను కాజేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కొంతమంది ఖాతాదారులు తాము బ్యాంకులో దాచుకున్న డబ్బులను ఇతర అవసరాలకు వినియోగించుకొనుటకు బ్యాంక్‌కు వచ్చి డబ్బులను డ్రా చేసేందుకు ప్రయత్నం చేయగా బ్యాంక్ అధికారులు వారి అకౌంట్లలో డబ్బులు లేవని తెలపడంతో బ్యాంక్ మేనేజర్ హుస్సేన్‌బాషాకు ఫిర్యాదు చేయడంతో ఆయన పూర్తిస్థాయిలో విచారణ చేయగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. 2018 నుంచి బ్యాంక్ లో క్లర్క్‌గా పనిచేస్తున్న కిరణ్ అనే ఉద్యోగి ఒకరి బ్యాంక్ ఖాతాల్లోని మరొకరికి మళ్లించి అలా బ్యాంక్‌లో పొదుపు చేసిన 21మంది ఖాతాదారుల అకౌంట్ల నుంచి రూ.95 లక్షలు మాయం చేసినట్లు సంబంధిత అధికారులు నిర్ధారించారు. చాలా ఏండ్ల నుంచి బ్యాంక్‌లో పనిచేస్తున్న కిరణ్ డబ్బులను ఖాళీ చేసినట్లు నిర్ధారణ కావడంతో అతడిని విధుల నుంచి తప్పించడంతోపాటు సస్పెండ్ చేసి జైలుకు పంపినట్లు మేనేజర్ తెలిపారు. అయితే బాధితులకు ఇప్పటి వరకు సస్పెండైనా వ్యక్తినుంచి గాని, బ్యాంక్ నుంచి గాని పోయిన డబ్బులు రాకపోవడంతో మంగళవారం బ్యాంక్ ఎదుట బాధితులు ఆందోళన చేపట్టి మేనేజర్‌ను నిలదీశారు. వారికి తోడుగా టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బొజ్జ అమరేందర్‌రెడ్డి మద్దతుగా నిలిచి అవసరాల కోసం బ్యాంక్‌లో డబ్బులు దాచుకుంటే అమాయక ప్రజల అకౌంట్‌ల నుంచి అనుమతి లేకుండా డబ్బులను దోచుకోవడంతోపాటు ఏడాదైనా తిరిగి ఇవ్వకపోవడం బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమేనని ఆరోపించారు. ఈ నెల ఆఖరుగాలోగా బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వకపోతే బ్యాంక్ ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. దీంతో మేనేజర్ మాట్లాడుతూ నెలలో బాధితులకు డబ్బులు చెల్లిస్తామని చెప్పారు.

అర్హుల చెంతకు పథకాలు చేరాలి

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 17 : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న పథకాలను సత్వరమే అర్హులకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రతి అధికారి తన పరిధిలో ఉన్న సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. భూములకు సంబంధించిన సమస్యలపై ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిరబోయి మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జిల్లా అధికార యంత్రాంగం త్వరితగతిన స్పందించి నష్టాన్ని నివారించుకోగలిగామని అన్నారు. పంటనష్టం, కూలిన ఇండ్లు, ఇతర నష్టాలపై ప్రభుత్వానికి నివేదిక సైతం పంపించినట్లు తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలను తనిఖీ చేసే బాధ్యతను జిల్లా అధికారులకు అప్పగించామని, సీజనల్ వ్యాధులు అరికట్టడంలో విజయవంతం అయ్యామని వెల్లడించారు.

'హనీమూన్ డేట్ అయిపోయింది.. పనిచేసే కాలం వచ్చింది' : ఎమ్మెల్యేలు

'ప్రతి ఫోన్‌కాల్ మాకే.. రోజూ దాదాపుగా 3 వేల ఫోన్‌కాల్స్ ఎమ్మెల్యేలకు వస్తున్నాయ్.! డాక్టర్ వద్దకు వెళ్తే క్యాన్సర్ వస్తుందని చెప్పారు.. మీరు అర్థం చేసుకోవాలి.. ప్రజలు మీకు డైరెక్టుగా ఫోన్ చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోకుంటే మీ విధి నిర్వహణలో మీరు ఫెయిల్ అయినట్లే లెక్కా..! ఇది చాలా స్పష్టంగా క్లారిటీగా మా ఎమ్మెల్యేలమంతా అనుకొని మాట్లాడుతున్న విషయం'.. అంటూ జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యేలు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, జిల్లా అధికారుల పనితీరు మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేలకు ఫోన్లు ఎక్కువగా చేస్తున్నారంటే అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తలేరని అర్థం అంటూ పేర్కొన్నారు. ఒక ఎలక్ట్రిసిటీ పోల్ కోసం ఒక ఎమ్మెల్యే వందసార్లు కాల్ చేయాల్సి వస్తోందని ఇదే విధానం అన్ని శాఖల్లోనూ ఉందని, పోలీసు, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ అధికారులు వాళ్ల వాళ్ల బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. శాఖల వారీగా 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9 లిస్టు ఔట్ చేసి ఉన్నత స్థాయి మొదలు కింది స్థాయి అధికారులందరి జాబితా ఇవ్వాలన్నారు. అధికారులు అందుబాటులో లేకుంటేనే ఎమ్మెల్యేలకు ఫోన్లు వస్తాయన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే విషయం పైకి తీసుకెళ్తామని, ఇది ముఖ్యమంత్రి జిల్లా అనే విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. మీ వల్ల కాని పనులు ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. చాలా వరకు సీట్లపై అధికారులు కూర్చోవడం లేదు.. జిల్లా స్థాయి అధికారులు సైతం అందుబాటులో ఉండటం లేదని అన్నారు. పైఅధికారి లేకుంటే కిందిస్థాయి అధికారి వినే సదుపాయాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేయాలన్నారు. హనీమూన్ డేట్ మీకు, మాకు అయిపోయింది..! ఇప్పుడు మనం పనిచేసే కాలం వచ్చిందన్నారు. మన విధులను సక్రమంగా నిర్వర్తించే కాలం వచ్చింది.. మనందరం కూడా ఒకటింగా పనిచేసి మన జిల్లాను మార్చుకుందాం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందుకు సాగాలన్నారు.. తాగునీటి సమస్య తీర్చాలి.. సరైన సమయంలో మండలాల ఏఈలు స్పందించడం లేదని .. 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంటు పోయిందని' అపోహలు మనపై పెట్టారని అన్నారు.. ఎంపీ ఎన్నికల్లో ఆ ప్రాబ్లం ఫేజ్ చేశాం.. అప్పట్లో నష్టం జరిగింది. ఇది అధికారులందరికీ తెలుసు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరుకు ప్రత్యేకత ఉందన్నారు. ఈ జిల్లాలో ఏం జరిగినా రాష్ట్రవ్యాప్తంగా చర్చ ఉంటుందన్నారు. ఒక కార్యదర్శి బదిలీ అయినా.. 2 నెలలు గడిచినా.. రికార్డులు కొత్తగా వచ్చిన సెక్రటరీకి ఇవ్వలేదంటే ఎన్ని అనుమానాలు వస్తాయో ఒక్కసారి ఆలోచించాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఎమ్మెల్యేలకు సమన్వయకర్తను ఏర్పాటు చేయాలని కోరారు. డిప్యూటీ సీఎం స్పందిస్తున్నా.. స్థానిక అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజాసంక్షేమం సాధ్యపడుతుందన్నారు. పత్రికల్లో ఏం వచ్చినా వెంటనే స్పందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో పలువురు ఎమ్మెల్యేలు

బస్సు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు వద్ద పోలీసులు

పెబ్బేరు, సెప్టెంబర్ 17 : పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో మంగళవారం తీవ్ర విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 44వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన అందరినీ కలిచివేసింది. ఎస్సై హరిప్రసాదరెడ్డి కథనం మేరకు ఎనుముల రాముడు (56), మసీదు శేఖర్ (55) వ్యవసాయదారులు. వీరు తమ పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కర్నూలుకు వెళ్తున్న హైదరాబాద్ పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనుముల రాముడు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మసీదు శేఖర్‌ను వనపర్తి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త కారణంగా వీరిరువురు మృతిచెందారని ఎనుముల రాముడు కుమారుడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ లక్ష్మీకాంతరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృతదేహాలకు వనపర్తిలో పోస్టుమార్టం చేయించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.